నమస్తే తెలంగాణ

# వికారాబాద్

I | హైదరాబాద్, ఆదివారం 14 ఏప్రిల్ 2024 | VIKARABAD




లోక్‌సభ ఎన్నికల ప్రచార శంఖారావాన్ని శనివారం బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ చేవెళ్ల నుంచి పూరించారు. చేవెళ్ల ఫరా ఇంజినీరింగ్ కాలేజీ మైదానంలో ఏర్పాటు ప్రజా ఆశీర్వాద సభ విజయవంతమైంది. ఈ సభకు జనం ర్యాలీగా తరలి రాగా.. చేవెళ్ల శివారు ప్రాంతాలన్నీ సందడిగా మారాయి. కిలోమీటర్ల మేర దారులు వాహనాలతో కిక్కిరిసిపోయాయి. సభలో ఇసుకేస్తే రాలనంత జనం.. దిక్కులు పిక్కటిల్లేలా జనం నినాదాలతో బీఆర్‌ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ విజయం ఖాయమనడానికి సాక్ష్యంగా నిలిచాయి. బీఆర్‌ఎస్ జెండాలు, కటౌట్లతో రోడ్లు, సభా ప్రాంగణం గులాబీ వనాలను తలపించాయి. అశేషంగా తరలివచ్చిన జన సునామీ.. గులాబీ దళపతి కేసీఆర్‌కు జేజేలు పలికింది.

## రంజిత్ రెడ్డి ఏమైనా పొద్దుతిరుగుడు పువ్వా..

### కేసీఆర్ విమర్శ

రంజిత్ రెడ్డి పార్టీ ఫిరాయింపుపై కేసీఆర్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. బీఆర్‌ఎస్ పుణ్యాన గెలిచిన వ్యక్తి అని..ఆయనకు ఏం తక్కువ చేశామని ప్రశ్నించారు. ఆయన ఏమైనా పొద్దు తిరుగుడు పువ్వా? అధికారం ఎక్కడుంటే అక్కడికి వెళ్తారా! అని ఎద్దేవా చేశారు. అధికారం కోసమా? పదవుల కోసమా? పైరవీల కోసమా! అని ప్రశ్నించారు. ఎంపీ టికెట్ ఇచ్చి గౌరవించామని, తానే స్వయంగావచ్చి ప్రార్థిస్తే ప్రజలు రంజిత్ రెడ్డిని గెలిపించారని కేసీఆర్ గుర్తు చేశారు. బీజేపీ తరపున పోటీ చేస్తున్న వ్యక్తిగానీ..కాంగ్రెస్‌లో చేరిన వ్యక్తి ఎంపీగా గెలవక ముందు ఎవరికీ తెల్వరని పేర్కొన్నారు. దయచేసి ఆలోచన చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ విధంగా ఫిరాయింపులకు పాల్పడే వారికి దీటైన దెబ్బ కొట్టాలని కేసీఆర్ మనవి చేశారు. బీఆర్‌ఎస్ పార్టీలో అధిక ప్రాధాన్యత కల్పించిన రంజిత్ రెడ్డి పార్టీ ఫిరాయింపునకు పాల్పడడం సరైంది కాదన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.





చేవెళ్ల సభకు హాజరైన అశేష జనవాహిని

# జయం ఖాయం.. జనమే సాక్ష్యం

### జాతరలా కిక్కిరిసిన చేవెళ్ల సభ.. కేసీఆర్ ప్రసంగానికి నీరాజనాలు

## కలిసిరానున్న చేవెళ్ల సెంటిమెంట్

### ముందుండి నడిపిస్తున్న సబిత

రంగారెడ్డి, ఏప్రిల్ 13(నమస్తే తెలంగాణ): **లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్** పార్టీ చేవెళ్ల నుంచి ప్రచారానికి శ్రీకారం చుట్టింది. అన్ని రాజకీయ పార్టీలు ఇక్కడి నుంచే కార్యక్రమాలను లాంఛనంగా ప్రారంభిస్తూ వస్తుండగా..బీఆర్‌ఎస్ సైతం లోక్‌సభ ఎన్నికల్లో అదే అస్త్రాన్ని ప్రయోగించింది. వైఎస్ గెలుపునకు చేవెళ్ల సెంటిమెంట్‌గా నిలవగా..గత అసెంబ్లీ ఎన్నికల్లో, తాజా లోక్‌సభ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ చేవెళ్ల వేదికగా సభలు, సమావేశాలను నిర్వహించి అధికారంలోకి వచ్చింది. బీజేపీ సైతం అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇదే ప్రాంతంలో సభను నిర్వహించింది. జాతీయ స్థాయి నేతలు సైతం ఈ సభల్లో పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీలకు చేవెళ్ల సెంటిమెంట్‌గా మారింది. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ సైతం లోక్‌సభ ఎన్నికల్లో ఇదే సెంటిమెంట్‌ను అనుసరించాలని సంకల్పించి చేవెళ్ల నుంచే లోక్‌సభ ప్రచారాన్ని మొదలు పెట్టాలని నిర్ణయించి తొలిసభను ఇక్కడే నిర్వహించారు. ఈ సభ గ్రాండ్ సక్సెస్ కావడంతో రాష్ట్రం అంతటా బీఆర్‌ఎస్‌కు తిరుగు ఉండదని, పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయ దుందుభి మోగించడం ఖాయమన్న భావన ప్రతి ఒక్కరిలో వ్యక్తమవుతున్నది. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి మొదటి నుంచీ ముందుండి నడిపిస్తూ క్యాడర్‌లో కొత్త ఉత్తేజాన్ని నింపుతూ వస్తున్నారు. చేవెళ్ల సభ సక్సెస్ కావడంలోనూ సబిత కీలకపాత్ర పోషించారు. సభ తేదీ ప్రకటించిన నాటి నుంచే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలతో సమాలోచనలు జరపడమే కాకుండా.. ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ సభ సక్సెస్‌కు తనవంతు పాత్ర పోషించారు. సభా స్థలం ఎంపిక నుంచి ఏర్పాట్లు, జన సమీకరణ అన్నింటిలోనూ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. గత రెండు రోజులుగా వరుసగా సభాస్థలికి వెళ్లి దగ్గరుండి పరిస్థితులను సమీక్షించారు. సభ సక్సెస్ కోసం ముందుగానే సన్నాహక సమావేశాలు సైతం నిర్వహించారు. కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, మండలాలు, గ్రామాల వారీగా నేతలకు బాధ్యతలను అప్పగించారు. ప్రజలు స్వచ్ఛందంగా పెద్ద ఎత్తున తరలివచ్చి కేసీఆర్‌కు భరోసా ఇవ్వడంతోపాటు ఎంపీ అభ్యర్థి జ్ఞానేశ్వర్‌ను ఆశీర్వదించాలని ఇచ్చిన పిలుపునకు జనం స్పందించి అశేషంగా తరలివచ్చారు. సభకు వచ్చిన వారికి ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చూసుకోవడంతోపాటు పెద్ద ఎత్తున తరలివచ్చిన మహిళలు, వృద్ధులు ఇబ్బందులు పడకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయించారు.





చేవెళ్ల సభలో ప్రసంగిస్తున్న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, చిత్రంలో ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, ఎమ్మెల్యే కాలె యాదయ్య తదితరులు

## కాసాని విజయం ఖాయమైంది

> ప్రభుత్వం మెడలు వంచడంలో పదునైన అంకుశం కాసాని జ్ఞానేశ్వర్
>
> కాసానిని గెలిపించి బీసీలు సత్తా చూపాలి
>
> చేవెళ్ల ప్రజా ఆశీర్వాద సభలో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్
>
> రంజిత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విమర్శలు చేసిన కేసీఆర్
>
> లోక్‌సభ తొలి ఎన్నికల ప్రచార సభ విజయవంతం కావడంతో బీఆర్‌ఎస్ శ్రేణుల్లో జోష్

రంగారెడ్డి, ఏప్రిల్ 13(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ మెడలు వంచాలంటే ప్రజల చేతిలోకి ఒక అంకుశం కావాలని, అలాంటి అంకుశంలో పదునైన మొనదేలినటువంటి అంకుశం చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ అని బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. శనివారం చేవెళ్లలో నిర్వహించిన ప్రజాఆశీర్వాద సభలో ఆయన మాట్లాడుతూ అనుభవం ఉన్న వ్యక్తి అని, బలహీనవర్గాల కోసం కాసాని తన జీవితాన్ని ధారబోశారన్నారు. రాష్ట్ర ప్రజలందరికీ కాసాని సుపరిచితుడని, జడ్పీ చైర్మన్‌గా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రజానీకానికి ఎనలేని సేవ చేశారన్నారు. చేవెళ్ల సభ సక్సెస్‌తో కాసాని విజయం ఖాయమైపోయిందని వ్యాఖ్యానించారు. బీసీలకు దమ్ముంటే బీసీ అభ్యర్థిని గెలిపించుకోవాలని కాంగ్రెస్ నాయకుడొకరు సవాల్ విసిరారని, కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకుని బీసీలు సత్తా చాటాలని పిలుపునిచ్చారు. అమలుగాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచాలంటే అన్ని ఎంపీ స్థానాల్లో బీఆర్‌ఎస్ పార్టీ గెలవాల్సిన అవసరం ఉందన్నారు.

### పారిశ్రామిక కేంద్రంగా చేవెళ్లను తీర్చిదిద్దాం..

బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో చేవెళ్ల ప్రాంతాన్ని పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దామని కేసీఆర్ పేర్కొన్నారు. షాబాద్, సీతారాంపురం, చందనవెల్లిలో వెల్‌స్పన్, కిటెక్స్, అమెజాన్ ఈస్టర్, ఎలక్ట్రిక్ వెహికిల్ తయారీ కంపెనీ, రైల్వే కోచ్ ఫ్యాక్టరీలను ఏర్పాటు చేశామన్నారు. వికారాబాద్, చేవెళ్ల, తాండూరు, పరిగి నియోజకవర్గాలకు సాగు నీళ్లు తెచ్చేందుకు పాలమూరు ప్రాజెక్టును చేపట్టామని చేవెళ్ల ప్రాంతానికే నీరందించేందుకు ఉద్దండాపూర్ రిజర్వాయర్‌ను నిర్మించామన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో హైదరాబాద్‌తో సహా రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలతోపాటు యావత్ తెలంగాణలో భూముల ధరలు ఎట్లుండె.. ఇప్పుడు ఎట్లున్నయో ప్రజలు గమనించాలన్నారు. ఉన్నట్టుండి రియల్ ఎస్టేట్ ఎందుకు ఆగిపోయిందని ప్రశ్నించారు. దీని వెనుక ఉన్న బ్రోకర్లు ఎవరు? జోకర్లు ఎవరు? అని నిలదీశారు. సభలో మాజీ మంత్రులు సబితారెడ్డి, పొన్నాల లక్ష్మయ్య, టీఎస్ఐఐసీ మాజీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు, ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, ప్రకాశ్ గౌడ్, అరికెపూడి గాంధీ, ఎమ్మెల్సీలు వాణీదేవి, దయానంద్ గుప్తా, ఎగ్గె మల్లేశం, శాసన మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, కొప్పుల మహేశ్ రెడ్డి, పైలెట్ రోహిత్ రెడ్డి, రసమయి బాలకిషన్, బీఆర్‌ఎస్ రాష్ట్ర యువనేత పట్లోళ్ల కార్తిక్ రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, నియోజకవర్గ సమన్వయ కర్త రాంబాబు యాదవ్, జడ్పీటీసీలు పట్నం అవినాశ్ రెడ్డి, కాలె శ్రీకాంత్, నీరటి తన్వీరాజ్, కాలె జయమ్మ, ఎంపీపీలు గోవర్ధన్‌రెడ్డి, నక్షత్ర, కాలె భవాని, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు వెంకటేశ్వర్‌రెడ్డి, నాగేందర్‌గౌడ్, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు స్వప్న, మాజీ ఎంపీపీ మంగలి బాల్‌రాజ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు ప్రభాకర్, నర్సింగ్‌రావు, గోపాల్, నాగిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్లు మిట్ట వెంకట రంగారెడ్డి, పాపారావు, నర్సింగ్ రావు, ప్రశాంత్ గౌడ్, వికారాబాద్ జడ్పీ వైస్ చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు కాసాని వీరేశం, కొంపల్లి అనంత రెడ్డి, దేశమళ్ల ఆంజనేయులు, కొప్పుల అనిల్ రెడ్డి, మల్లారెడ్డి, మంగలి యాదగిరి, కర్నె శివప్రసాద్, పోలీస్ రాంరెడ్డి పాల్గొన్నారు.

### కరెంట్ కష్టాలు మొదలయ్యాయి



తెలంగాణ అప్పుడు ఎట్ల ఉండే, ఇప్పుడు ఎట్ల అయ్యింది ఒకసారి ప్రజలు ఆలోచించాలి. చేవెళ్ల నియోజకవర్గం ఈసీ, మూసీ నదుల మధ్య ప్రజలకు ఎంతో ఇబ్బందిగా ఉన్నటువంటి సందర్భంలో ఈసీ, మూసీ నదుల మీద 10 బ్రిడ్జిల ఇచ్చిన ఘనత కేసీఆర్‌దే. చేవెళ్ల నియోజకవర్గంలో 84 గ్రామాలకు గుదిబండలాంటి సమస్య 111జీఓ ఎత్తివేసి అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు.

\- కాలె యాదయ్య, చేవెళ్ల ఎమ్మెల్యే

### 93 బీసీ కులాలను ఏకం చేసిన వ్యక్తి జ్ఞానేశ్వర్:

ఎగ్గె మల్లేశం, ఎమ్మెల్సీ



93 బీసీ కులాలను ఏకం చేసిన వ్యక్తి, ఎమ్మెల్సీగా, జిల్లా పరిషత్తుగా పనిచేసి అనుభవమున్న వ్యక్తి జ్ఞానేశ్వర్. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో ముదిరాజ్ సంఘం, కురుమ సంఘం సభ్యులు పెద్ద ఎత్తున ఉన్నారు. జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందాం.

### సొంత అభ్యర్థులను నిలిపే సత్తా ఆ పార్టీలకు లేదు:

మెతుకు ఆనంద్, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే



బీఆర్‌ఎస్ పార్టీలో గెలిచిన ఇద్దరు వ్యక్తులు ఒకరు కాంగ్రెస్ పార్టీ నుండి, మరొకరు బీజేపీ నుంచి అభ్యర్థులుగా ఉన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు సొంత అభ్యర్థులను పోటీలో నిలిపే సత్తా కూడా లేదు.

### ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలి

కొప్పుల మహేశ్‌రెడ్డి, పరిగి మాజీ ఎమ్మెల్యే



తెలంగాణ కోసం పుట్టిన పార్టీ బీఆర్‌ఎస్. పదేళ్ల కాలంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం దేశానికే కాదు...ప్రపంచానికే తెలంగాణ దిక్సూచిగా మార్చిన ఘనత కేసీఆర్‌దే. జ్ఞానేశ్వర్ గెలుపునకు సైనికుల్లా పనిచేయాలి.

### ఉమ్మడి జిల్లాకు పట్టిన దరిద్రం పోయింది:

పైలెట్ రోహిత్‌రెడ్డి, తాండూరు మాజీ ఎమ్మెల్యే



బీఆర్‌ఎస్ పార్టీని వీడిన నేతల వల్ల, ఉమ్మడి జిల్లాకు పట్టిన దరిద్రం పోయింది. పట్నం మహేందర్‌రెడ్డి కుటుంబం బీఆర్‌ఎస్‌ను వీడడంతో పార్టీ శ్రేణులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రేవంత్‌రెడ్డి కొడంగల్‌కు మాత్రమే సీఎంగా వ్యవహరిస్తున్నారు.

